TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :119 prajadivvs57@gmail. com సోమవారం 9, మార్చి 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-



సంజూ శాంసన్ (89)

# ఛాంపియన్ భారత్...

## టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర..

## న్యూజిలాండ్ పై అల్టిమేట్ విక్టరీ

- 2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్
- పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు
- ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన
- అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్



బుమ్రా (4/15

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు భారత్ ముచ్చటగా మూడో ముద్దు ఇచ్చింది. 2007లో ఎం.ఎస్ ధోని తొలిసారి భారత్‌ను టీ20 ప్రపంచకప్ విజేతగా నిలుపగా.. 2024లో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ ఇండియా విజేతగా అవతరించింది. సొంతగడ్డపై డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో నిలిచిన భారత్‌ను సూర్యకుమార్ యాదవ్ 2026లో చాంపియన్‌గా నిలబెట్టాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను మూడుసార్లు నెగ్గిన ఏకైక జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది.

మిగతా 2లో.



### 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి

# పూర్తిచేస్తాం

- రాష్ట్ర వ్యాప్తంగా భూ సేకరణకు రూ.5 వేల కోట్లు కేటాయిస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేసింది
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 30నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్ట్‌లపై మంత్రులు

మిగతా 2లో.

### మహిళాభివృద్ధి కోసం

# 'స్వయం' బ్రాండ్..

## నేనే అంబాసిడర్‌గా ఉంటా: సీఎం చంద్రబాబు

- అమరావతిలో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల

మిగతా 2లో.

# ఆస్పత్రుల్లో ఏఐ సేవలు

## పైలట్‌గా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో వినియోగం: మంత్రి సత్యకుమార్



: కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 మంది ఇన్నోవేటర్లు ఏకకాలంలో 40 పరికరాల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారన్నారు.

మిగతా 2లో.

# ఇరాన్‌లో ఇంధన నిల్వ కేంద్రాలపై దాడులు

- అంతరిక్ష సంస్థ హెడ్‌క్వార్టర్స్, ఇస్ఫహాన్ ఎయిర్‌పోర్ట్ ధ్వంసం
- 'గల్ఫ్'లోని చమురు రిఫైనరీలు, ఎయిర్‌పోర్ట్‌లపై ఇరాన్ దాడులు
- బహ్రెయిన్‌లోని అమెరికా నేవీ బేస్‌పై దాడి
- సౌదీలో ఒక భారతీయుడు సహా ఇద్దరి మృతి
- కువైట్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై క్షిపణి దాడి
- ఉప్పు నీటిని తాగునీటిగా మార్చే కేంద్రాలపైనా పరస్పరం దాడులు
- ఇరాన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన గల్ఫ్ దేశాలు
- తమ రక్షణకు అమెరికా బేస్‌లపై దాడి చేసే హక్కు ఉందన్న ఇరాన్

పశ్చిమాసియా యుద్ధం ప్రమాదకర మలుపు తిరుగుతోంది. ఇరువైపులా ఎవరూ వెనక్కి తగ్గని స్థితిలో పరస్పర దాడులు మిలిటరీ, రక్షణ పరిమితులు దాటి విపరీత పరిణామాల వైపు దారితీస్తున్నాయి. పౌర ఆస్తులు, చమురు రిఫైనరీలు, చమురు నిల్వ కేంద్రాలు,

మిగతా 2లో.



### కాలేజీ అమ్మాయిలకు

# ఉచిత ఈవీ స్కూటీలు

- ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట..
- ఆర్థికంగా శక్తిమంతులను చేస్తున్నాం
- జర్నలిస్టులకు ఫ్యూచర్‌సిటీలో మోడల్ కాలనీ
- ఇళ్ల స్థలాలపై త్వరలోనే తీపి కబురు చెబుతాం
- ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టుల మధ్య తేడా లేకుండా
- అందరికీ న్యాయం చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం




కాలేజీ విద్యార్థినులకు త్వరలో ఉచితంగా ఎలక్ట్రిక్ (ఈవీ) స్కూటీలు అందించబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆ వాహనాలకు జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలో కాలుష్యాన్ని వెదజల్లుతున్న 2500 ఆర్టీసీ డీజిల్ బస్సులను డిసెంబరులోపు జిల్లాలకు తరలించి, వాటి స్థానంలో పూర్తి స్థాయిలో ఈవీ బస్సులను ప్రవేశపెడతామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులను సన్మానించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఏటా మహిళా దినోత్సవం నాడు కేవలం శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా.

మిగతా 2లో.

# ఛాంపియన్ భారత్...

టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది.

256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా




తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతడు కేవలం 18 బంతుల్లోనే 50 పరుగులు చేశాడు. ఈ మెగా టోర్నీలో ఇదే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ.

ఆ తర్వాత ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.

# మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్..

**మొదటిపేజీ తరువాయి**

అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు.

"మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు.

ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని



చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు.

తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు 'ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు వద్దు' అన్నాను. కానీ ఇప్పుడు 'ఒక బిడ్డ వద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు ముద్దు' అని చెబుతున్నాను. రాష్ట్రంలో జననాల రేటు 1.5కి పడిపోయింది. ఇది ప్రమాదకరం. అందుకే పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు అవసరమైతే మూడు పడకగదుల ఇల్లు, అదనపు రేషన్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని నూతన విధానాన్ని ప్రకటించారు.

# ఆస్పత్రుల్లో ఏఐ సేవలు

**మొదటిపేజీ తరువాయి**

దీనివల్ల తక్కువ సమయంలోనే వ్యాధి నిర్ధారణ అవుతుందని, దీంతో రోగులకు చికిత్స అందించేందుకు వైద్యులకు సమయం ఆదా అవుతుందని చెప్పారు. విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, కాకినాడ ప్రభుత్వాస్పత్రుల్లో, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, పార్వతీపురం, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో వివిధ రకాల పరీక్ష లు చేస్తున్నామని చెప్పారు. రోగులు, వైద్యుల మధ్య జరిగే సంభాషణను రికార్డింగ్ చేయడం, దగ్గు ద్వారా టీబీని గుర్తించడం, గుండెజబ్బులు, రక్తహీనతను గుర్తించడం, సర్వైకల్ క్యాన్సర్ చికిత్సలో ఏఐ కెమెరా వినియోగం, చిన్నపిల్లల్లో న్యూరాలజికల్ డిజార్డర్స్, క్యాటరాక్ట్, గ్లాకోమా, రక్తహీనత, ఇతర పరీక్షలకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తారని తెలిపారు. ఇటీవల ఆస్పత్రుల్లో పైలట్ విధానంలో ప్రారంభమైన వీటి ఫలితాలపై సీఎం చంద్రబాబుకు నివేదిక అందిస్తామని మంత్రి తెలిపారు.

# 30 నెలల్లో పాలమూరు -రంగారెడ్డి పూర్తిచేస్తాం



**మొదటిపేజీ తరువాయి**

జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ నీటి పారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేండ్లలోనే ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకు గాను (జూన్ 2 నాటికి) రూ.5వేల కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కృష్ణా, గోదావరి రెండు బేసిన్లలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక వరి పండిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశామంటూ గత పాలకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ.55 వేల కోట్ల ప్రాజెక్ట్‌లో రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తే అది 90 శాతం పూర్తయినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. వారి హయాంలో నే పాలమూరు అంచనాలను రూ.84 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి నీరివ్వలేదని ఆరోపించారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం జరిగిందన్నారు.

ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7,161 కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇందులో ప్రాజెక్ట్ పనులకు రూ.6,718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్టు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్ట్‌లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2014 జూన్ 2న ఎలా ఉన్నాయో 2024 జూన్ 2న కూడా అలాగే ఉన్నాయని చెప్పారు. ఎంత ఖర్చయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించామని చెప్పారు. కల్వకుర్తికి రూ.909 కోట్లు, నెట్టెంపాడుకురూ.252 కోట్లు, భీమాకు రూ.200 కోట్లు, కోయిలసాగర్‌కు రూ.185 కోట్లు కేటాయింపులు జరిగాయని వివరించారు.

# ఇరాన్‌లో ఇంధన నిల్వ కేంద్రాలపై దాడులు

**మొదటిపేజీ తరువాయి**

విమానాశ్రయాలు వంటి కీలక మౌలిక సదుపాయాల విధ్వంసం వైపు అడుగులు పడుతున్నాయి. ఇరాన్‌లోని విమానాశ్రయాలు, పారిశ్రామిక ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్, అమెరికా.. తాజాగా పెట్రోలియం నిల్వ కేంద్రాలను, తాగునీటి కోసం ఉద్దేశించిన డీసాలినేషన్ ప్లాంట్లనూ లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాన్ అంతరిక్ష సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో ఆస్పత్రులు, స్కూళ్లు కూడా దెబ్బతింటున్నాయి. మరోవైపు అరబ్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలతోపాటు చమురు రిఫైనరీలు, పౌర విమానాశ్రయాలు, హోటళ్లు, జనావాసాలపైనా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు పడుతున్నాయి. తాజాగా డీసాలినేషన్ ప్లాంట్లపైనా ఇరాన్ డ్రోన్లు ప్రయోగిస్తోంది.

ఇరాన్ రాజధాని టెహ్రాన్ శివార్లలో, అల్బోర్జ్ ప్రావిన్స్‌లో ఉన్న నాలుగు భారీ ఇంధన నిల్వ కేంద్రాలు, ఒక డిస్ట్రిబ్యూషన్ కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ ఆదివారం దాడి చేశాయి. దీనితో పెట్రోలియం ఉత్పత్తులన్నీ అంటుకుని, భారీగా పేలుళ్లు, మంటలు చెలరేగాయి. సమీప ప్రాంతాలన్నీ నల్లటి విషవాయువులతో నిండిపోయాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారని, 21 మంది గాయపడ్డారని ఇరాన్ వార్తా సంస్థ టాస్నిమ్ వెల్లడించింది. కాగా "యుద్ధంలో ఇదొక ప్రమాదకరమైన పరిణామం. ఇంధన కేంద్రాలపై దాడితో ప్రమాదకర, విషపూర్తి రసాయనాలు వెలువడుతున్నాయి. సాధారణ ప్రజలు వాటిని పీల్చుకోవాల్సి వస్తోంది. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది తీవ్రమైన యుద్ధనేరం కిందకే వస్తుంది" అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఇరాన్ మిలటరీ వ్యవస్థలకు ఇంధనాన్ని సరఫరా చేస్తున్నందునే ఆయిల్ డిపోలపై దాడి చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. కాగా, ఇంధన కేంద్రాలపై దాడుల నేపథ్యంలో.. ఇరాన్ ప్రభుత్వం ప్రజలకు అందించే ఇంధన కోటాను వారానికి 30 లీటర్ల నుంచి 20 లీటర్లకు తగ్గించింది.

## ఇరాన్ అంతరిక్ష సంస్థ హెడ్‌క్వార్టర్స్ ధ్వంసం

టెహ్రాన్‌లోని ఐఆర్‌జీసీ స్పేస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ అంతరిక్ష సంస్థకు చెందిన పరిశోధన, కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఈ కార్యాలయంలోనే ఉన్నాయని.. ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఇరాన్ ప్రయోగించిన ఖయ్యామ్ ఉపగ్రహ నియంత్రణ విభాగం కూడా ఇందులోనే ఉందని పేర్కొంది. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ఎయిర్‌పోర్టులో ఎఫ్-14 యుద్ధ విమానాలను, క్షిపణి రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామని వెల్లడించింది. నార్వేలోని అమెరికా ఎంబసీ వద్ద ఆదివారం పేలుడు సంభవించింది. అయితే ఈ పేలుడుతో పెద్దగా నష్టమేమీ జరగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని నార్వే వెల్లడించింది. పేలుడుకు పాల్పడినవారి కోసం గాలిస్తున్నట్టు తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఎంబసీలపై ఇరాన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో నార్వేలో పేలుడు చర్చనీయాంశంగా మారింది. ఇరాన్‌కు మద్దతుగా రంగంలోకి దిగిన హెజ్బొల్లా తీవ్రవాద సంస్థను అణచివేసేందుకు ఇజ్రాయెల్ భారీ స్థాయిలో దాడులు చేస్తోంది. లెబనాన్‌లోని 20 పట్టణాల్లో క్షిపణులు, యుద్ధ విమానాలతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో మృతుల సంఖ్య 394కు పెరిగిందని, అందులో 83 మంది పిల్లలు ఉన్నారని లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇరాన్‌వ్యాప్తంగా 10 వేల పౌర ఆవాసాలు ధ్వంసమయ్యాయని రెడ్ క్రిసెంట్ సొసైటీ తెలిపింది. ఇరాన్ దాడుల్లో 1,929 మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఇజ్రాయెల్ ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది.

# కాలేజీ అమ్మాయిలకు ఉచిత ఈవీ స్కూటీలు

**మొదటిపేజీ తరువాయి**

. వేలాది మంది ఆడబిడ్డలను పిలిచి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నామని తెలిపారు. "200 బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 8 ఏళ్లలో ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడం కోసం పనిచేస్తున్నాం. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించాం. కోటి 30 లక్షల జనాభా ఉన్న క్యూర్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్‌గా మారుస్తాం. సౌత్ కొరియా, న్యూయార్క్, టోక్యోతో హైదరాబాద్ పోటీపడేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మహిళలే రాష్ట్రానికి వెన్నెముక" అని సీఎం అన్నారు.

దేశంలో రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రులు, పార్టీ అధ్యక్షులుగా మహిళలకు అన్ని అత్యున్నత పదవులు ఇచ్చింది కాంగ్రె స్సేనని సీఎం రేవంత్ అన్నారు. ఉక్కు మహిళ సోనియాగాంధీ స్ఫూర్తితోనే తెలంగాణ ఏర్పడిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో కలెక్టర్లు, ఎస్పీలుగా ఎక్కడ ఏ అవకాశం వచ్చినా మహిళా అధికారులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ముఖ్యమైన శాఖలకు మహిళలు బాధ్యత వహిస్తున్నారని, హైదరాబాద్ లాంటి కీలక జిల్లాకు కలెక్టర్‌గా మహిళ ఉన్నారని తెలిపారు. ఎస్ఐబీలో పనిచేస్తున్న ఒక మహిళా అధికారి చొరవతో 700 మంది మావోయిస్టులు లొంగిపోవడం మహిళల కార్యదీక్షకు నిదర్శనమని కొనియాడారు. మహిళలను తాము కేవలం లబ్ధిదారులుగా చూడటం లేదని, వారిని ఆర్థికంగా శక్తివంతులను చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా.. 1000 బస్సులకు మహిళలను యజమానులను చేసి కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల యజమానులుగా మారుస్తున్నామని వెల్లడించారు.

'దేశ రాజధాని ఢిల్లీ.. వాయు కాలుష్యం వల్ల ఇబ్బంది పడుతోంది. ముంబై కూడా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతోంది. చెన్నైలో వరదల సమస్య ఉంది. దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌ను తీర్చిదిద్దారు. రెడ్, ఆరెంజ్ క్యాటగిరీ



పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు బయటకు పంపిస్తాం' అని సీఎం రేవంత్ అన్నారు. అంతర్జాతీయ స్థాయికి నగరాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు ఆరెం జ్ క్యాటగిరీలో ఉందని, ఇలాగే వదిలేస్తే.. రెడ్ జోన్‌లోకి వెళుతోందని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై విపక్షాల తీరును సీఎం తప్పుబట్టారు. అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమునా, యూపీలో గంగానది రివర్ ఫ్రంట్లు కట్టినప్పుడు లేని అభ్యంతరం హైదరాబాద్‌లో ఎందుకు? అని ప్రశ్నించారు. అహ్మదాబాద్‌లో 10 వేల కుటుంబాలను తరలించి సరైన సౌకర్యాలు కల్పించలేదని, నదులకు 50 మీటర్ల బఫర్ జోన్ ఏర్పాటు చేస్తూ తరువాత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 50 మీటర్ల లోపుల కట్టడాలపై నిషేధం ఉందని, అందుకే వాళ్లను పిలిచి మాట్లాడి చెప్పామని అన్నారు. వాళ్లకు 7 ఎకరాల భూమి ఇచ్చి.. అందులో అపార్ట్‌మెంట్ కట్టుకోవడానికి కావాల్సిన డబ్బును డిపాజిట్ చేస్తామన్నామని చెప్పారు. కానీ, దీనికి రాజకీయ రంగు పూసి.. ప్రతి పార్టీ అక్కడికి వెళ్లి సానుభూతి చూపుతున్నాయని విమర్శించారు. సానుభూతికి సమస్య పరిష్కారం కాదన్నారు. నగరాన్ని కాపాడుకోవడానికి అందరి సహకారం కావాలని, దీనిపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని చెప్పారు.

తన ప్రయాణంలో అనేక మంది జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులు శ్రేయోభిలాషులుగా ఉన్నారని సీఎం రేవంత్ తెలిపారు. ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టుల మధ్య తేడా లేకుండా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 'జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై త్వరలోనే మంచి వార్త చెబుతాం. చట్టం వల్ల ఇబ్బంది లేకుండా ఇళ్ల స్థలాలపై నిర్ణయం తీసుకుంటాం. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టుల కోసం ఒక అద్భుతమైన కాలనీని డిజైన్ చేస్తాం' అని సీఎం ప్రకటించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలపై ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేస్తామన్నారు. జర్నలిస్టుల ముసుగులో కొందరు చేసే పనులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'గతంలో ప్రగతి భవన్‌లోకి మహిళా జర్నలిస్టులు ఎంత మంది వచ్చారు? ఇప్పుడు అంతా వస్తున్నారు. ఇది ప్రజా వేదిక' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజరుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## వెల్జిపురం గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభం



**సిరిసిల్ల/ మార్చి 8 ప్రజా దివాస్** మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో వెల్జిపురం గ్రామంలో ఈరోజు ఏ డబ్ల్యు పి నిధులతో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ నిర్మాణం కొరకు సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ భూమి పూజ కార్యక్రమం నిర్వహించబడింది. మరియు వీ+చీ=జు+టా పథకం కింద సిసి రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ చంద్రశేఖర్, టీజ?విడీసీ ఏ ఈ నాగరాజు గారు, జెడ్ పి హెచ్ ఎస్ ఉపాధ్యాయులు హరికృష్ణ రెడ్డి , ఏఎంసి డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుండా వెంకన్న, వార్డు సభ్యులు గొల్ల కమిటీ మల్లవ్వ శంకరయ్య, సోనవేని (బొజ్జ) శ్రీనివాస్, సంగెపు వేణు, సంగెం ముత్తవ్వ, దేశెట్టి కవిత బాబు చందర్, వెలిచాల భారతి శ్రీనివాస్, వేములవాడ భారతి రాజేశం, బొల్లారం ప్రసన్న కుమార్, యువజన సంఘం అధ్యక్షులు వేములవాడ శివకుమార్, గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం



**ముస్తాబాద్ / మార్చ్ 8 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో మహాత్మ జ్యోతి బాపూలే గ్రంధాలయ వ్యవస్థాపకులు మార్వాడి గంగరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు పోటీలో ప్రతిభ కనబరిచిన ప్రథమ బహుమతి బొడ్డు భవాని 1500 విలువగల పట్టుచీర ద్వితీయ బహుమతి ధర కరుణకు వెయ్యి రూపాయల విలువ గల పట్టుచీర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ బోనాల రోజా చేతుల మీదుగా మహిళలకు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ గ్రంథాలయం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించి మహిళలు అందరు కూడా మహిళా దినోత్సవ సంబరాలు జరుపుకోవడానికి వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆకాశంలో సగం భాగం మహిళలు సంఘంలో సగం స్త్రీ అని అంటారు కానీ స్త్రీకి అన్ని రంగాల్లో సమానత్వం ఇచ్చినప్పుడు స్వేచ్ఛ ఉన్నప్పుడు నిజమైనటువంటి మహిళా స్వతంత్రం వచ్చినట్టుగా సమాజంలో మహిళలు చదువుకొని ఉద్యోగ రంగాల్లో రాజకీయ రంగాల్లో వ్యాపారంలో ముందంజలో ఉండి సమాజంలో తన వంతు పాత్ర పోషించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని సరైన క్రమశిక్షణలో పెంచి వారికి చిన్నప్పటి నుంచే నైతిక విలువలని పెంపొందింప చేయాలని శాస్త్రీయ విద్యా విధానాన్ని నేర్పించాలని అన్నారు. కార్యక్రవ ంలో గ్రంథాలయ వ్యవస్థాపకులు మార్వాడి గంగరాజు చైర్మన్ కనిమేని పెంటా రెడ్డి వైస్ చైర్మన్ పెద్దూరి శ్రావణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంత రాజు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంద బాల్ రెడ్డి సామాజిక కార్యకర్త మార్వాడి మౌనిక కమిటీ డైరెక్టర్లు కొత్తపల్లి శ్రీనివాస్ దాసోజు శ్రీనివాస్ బండి ఆదర్శ ధర సతీష్ చిగురి నర్సయ్య ఎస్ఎంఎల్ బాబా వెంకటేష్ వార్డు మెంబర్లు నాగిలి దేవవ్వ మానుక లత మహిళా సోదరులు పాల్గొన్నారు

## మహిళా శక్తికి అరుదైన గౌరవం...

**వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ లతకు ఘన సన్మానం..**



**వేములవాడ/మార్చి 08 ప్రజా దివాస్** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ భూక్య లతను డి.ఎస్.పి శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఆమె ప్రదర్శిస్తున్న నిబద్ధతను గుర్తిస్తూ, పట్టణ సిఐ వీరప్రసాద్‌తో కలిసి ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి శ్రీనివాసులు మాట్లాడుతూ...సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో సవాళ్లను ఎదుర్కొంటూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించడం అభినందనీయం అని ఆయన పేర్కొన్నారు. మహిళా సిబ్బంది అంకితభావం తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

# మహిళా సాధికారతే లక్ష్యం: బొల్లారంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**మహిళా శక్తికి నీరాజనం: బొల్లారంలో సర్పంచ్ సౌజన్య ఆధ్వర్యంలో ఉమెన్స్ డే వేడుకలు**

**వేములవాడ /మార్చి 08 ప్రజా దివాస్** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ గ్రామీణ మండలం బొల్లారం గ్రామంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సండేసరి సౌజన్య మల్లికార్జున్ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సౌజన్య మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, కుటుంబ అభివృద్ధిలోనే కాకుండా గ్రామ అభివృద్ధిలో కూడా మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. బొల్లారం గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి సౌజన్య మల్లికార్జున్ గ్రామంలో మహిళల సమస్యల పరిష్కారానికి, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి పనుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, పారిశుధ్యం మరియు తాగునీటి సౌకర్యాల మెరుగుదలలో తనదైన ముద్ర వేశారు. ఆమె నాయకత్వంలో గ్రామం అభివృద్ధి పథంలో సాగుతుండటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తమ సర్పంచ్ తమతో కలిసి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని మహిళలు కొనియాడారు. ఈ





కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సందర్భంగా 2కే రన్: పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**మహిళా శక్తిని చాటిన 2కే రన్.. విజేతలకు బహుమతుల ప్రధానం**

**ఉత్సాహంగా సాగిన మహిళా దినోత్సవ వేడుకలు..**

**పాల్గొన్న కౌన్సిలర్లు, తల్లిదండ్రులు**

**ఆరోగ్యం, మహిళా సాధికారతపై అవగాహన కల్పించిన**

**శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు**

**వేములవాడ/ మార్చి 08 ప్రజా దివాస్** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 2కే రన్ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్ ప్రారంభించారు. మహిళా సాధికారత మరియు ఫిట్‌నెస్ లక్ష్యంగా సాగిన ఈ 2కే రన్ లో పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ప్రతి మహిళ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు




నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం 2కే రన్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**-మహిళా కానిస్టేబుల్ పింకల్ యాదవ్‌కు సత్కారం: ఎస్సై రమాకాంత్...**




**వేములవాడ డివిజన్, బోయినపల్లి మండలం / మార్చి 08 ప్రజా దివాస్** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్ పింకల్ యాదవ్‌ను ఎస్.ఐ రమాకాంత్ మరియు పోలీస్ సిబ్బంది శాలువాతో కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రమాకాంత్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పింకల్ యాదవ్ చూపుతున్న అంకితభావం, పోలీస్ శాఖకు ఆమె అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల భద్రత, రక్షణ మరియు వారి గౌరవాన్ని కాపాడటంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు పోషిస్తున్న పాత్ర కీలకమని, వారి సేవలను గుర్తించి గౌరవించుకోవడం మన బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 14-15 ఏండ్లలోపు బాలికలు హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-సిరిసిల్ల జీ జీ హెచ్ లో హెచ్ పీ వీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభం**

**మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు: కలెక్టర్**

**రాజన్న సిరిసిల్ల, మార్చి - 08 ప్రజా దివాస్** జిల్లాలోని 14 నుంచి 15 ఏండ్ల వయసులోపు బాలికలకు హెచ్ పీ వీ (హ్యూమన్ పాపి లోమా వైరస్) వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు అనగా (ఏప్రిల్1 తేదీ 2011- మార్చి31 తేదీ 2012 మధ్య పుట్టిన) పలువురికి వ్యాక్సిన్ లు వేశారు. అనంతరం వారికి వాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు ఆడపిల్లల తల్లిదండ్రులు బాధ్యత వహించి హెచ్ పీ వీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలనిపిలుపు ఇచ్చారు. జిల్లాలో 3, 773 మంది బాలికలను గుర్తించారని, బాలికల తల్లిదండ్రులు గుర్తింపు కార్డుతో వచ్చి వ్యాక్సిన్ వేయించాలని



సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీ మొదలు పెట్టామని తెలిపారు. మహిళా దినోత్సవ వేడుకలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, డీఎం హెచ్ ఓ రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి సహస్ర ని ఆదుకోండి

**చిన్న సహాయం...ఒక ప్రాణానికి నూతన జీవితం...**
**మనసున్నవారి చేయూత కోసం వేచిచూస్తున్న తల్లిదండ్రులు...**
**చికిత్స కోసం రూ.30లక్షలు అత్యవసరం...**



**మార్చి 08 ప్రజా దివాన్** సిరిసిల్ల పట్టణానికి చెందిన ఒక పేద నేత కార్మికుడి కుటుంబం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉంది. తమ పదేళ్ల కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో, ఆ బిడ్డను కాపాడుకోవడానికి దాతల సాయం కోసం ఆ తల్లిదండ్రులు ఆర్తిగా ఎదురుచూస్తున్నారు. సిరిసిల్ల పట్టణం 34వ వార్డుకు చెందిన అంబటి వేణు వృత్తిరీత్యా నేత కార్మికుడు. ఆయన భార్య బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కుమార్తె అంబటి సహస్ర (10) గత కొంతకాలంగా తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్ లోని రెయిన్బో చిల్డ్రన్ హాస్పిటల్ కు తరలించగా, వైద్యులు పరీక్షించి చిన్నారికి అత్యవసరంగా లివర్ మార్పిడి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు అంచనా వేశారు. ఇప్పటికే అప్పులు చేసి రూ.5 లక్షల వరకు చికిత్స కోసం ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే ఆ కుటుంబానికి మిగిలిన మొత్తం సమకూర్చడం అసాధ్యంగా మారింది. మా కళ్లముందే బిడ్డ మంచాన పడి ఉంది. మేము ఎంతో ప్రయత్నించినా అంత పెద్ద మొత్తం సమకూర్చలేకపోతున్నాం. దయచేసి దాతలు ముందుకు వచ్చి మా బిడ్డ ప్రాణాలను కాపాడాలి అని తండ్రి అంబటి వేణు కన్నీటి పర్యంతమై వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకునే దాతలు ఫోన్‌పే నంబర్లు 9912231674 లేదా 9676260746 కు ఆర్థిక సాయం పంపించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.మనసున్న వారు ముందుకు వచ్చి చిన్నారి సహస్రకు ప్రాణదానం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు..

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్..



**వేములవాడ డివిజన్ /మార్చి 08 ప్రజా దివాస్** కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు.. ప్రభుత్వం పేద ప్రజలకు గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి సంతోషాన్ని పొందుతున్నాయని వారు పేర్కొన్నారు..

# మహిళాలను సన్మానించిన గ్రామ సర్పంచ్ బైతి దుర్గవ్వ



**ముస్తాబాద్/ మార్చ్ 8 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో గ్రామ సర్పంచి బైతి దుర్గవ్వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని వార్డు సభ్యులతోపాటు వివిధ శాఖలో పనిచేస్తున్న మహిళలు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దుర్గవ్వ గ్రామ కార్యదర్శి ఏఎన్ఎం ధనలక్ష్మి మహిళా సంఘాల సిఏలు అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# హన్మాజీపేటలో చలివేంద్రం ఏర్పాటు

**.. పాల్గొన్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**
**సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరం.. వార్డు సభ్యుడు కోడం రవి ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహణ**
**గ్రామ సర్పంచ్ జంకె మధు చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం**



**వేములవాడ/మార్చి 08 ప్రజా దివాస్** ఎండలు ముదురుతున్న వేళ బాటసారుల మరియు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ రూరల్ మండల పరిధిలోని హన్మాజీపేట గ్రామంలో 4వ వార్డు సభ్యుడు కోడం రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రాన్ని సర్పంచ్ జంకే మధుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. సర్పంచ్ జంకే మధు మాట్లాడుతూ గ్రామస్తుల సౌకర్యార్థం వార్డు మెంబర్ కోడం రవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి సేవా దృక్పథంతో ముందుకు రావడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ఉప సర్పంచ్ అవునూరి శంకరవ్వతో పాటు వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా



**ప్రజల సిరిసిల్ల జిల్లా మార్చి 8 ప్రజా దివాన్** మినీ స్టేడియంలో ఉమెన్ వాలీబాల్ ప్లేయర్స్ ను మరియు ఇతర బాలికలను ఆహ్వానించి మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఇందులో భాగంగా బాలికలకు క్యారం చెస్ షటిల్ బ్యాట్మెంటన్ వంటి రిక్రియేషన్ గేమ్స్ క్రీడా కార్యక్రమాలు ఆడిపించడం జరిగింది . ఇందులో పాల్గొన్నటువంటి బాలికలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పీచ్ ఇవ్వడం జరిగింది. ఇందులోపాల్గొన్నటువంటి బాలికలకు మహిళామనుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం, అదేవిధంగా మరియు క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్ గారి చేతులమీదుగా కూడా బహుమతి ప్రధానం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి క్రీడల శాఖ సిబ్బంది కోచ్ లు బాలికలు అందరూ పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# : ఆరెపల్లిలో ఘనంగా జల మహోత్సవం: నీటి సంరక్షణపై గ్రామస్తుల భారీ ర్యాలీ

**-పతి నీటి చుక్కను పొదుపుగా వాడాలి: సర్పంచ్ ఇటిక్యాల రాజు పిలుపు**
**- మిషన్ భగీరథ నీటిపై అవగాహన: ఆరేపల్లిలో జల జీవన్ మిషన్ కార్యక్రమం**
**-నీటి వృథాను అరికట్టి భావితరాలకు అందిద్దాం: సర్పంచ్ ఇటిక్యాల రాజు**




**వేములవాడ/మార్చి 08 ప్రజా దివాస్** వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి గ్రామంలో ఆదివారం జల మహోత్సవం కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇటిక్యాల రాజు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపు మరియు సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టారు. నీటిని వృథా చేయకండి, ప్రతి నీటి చుక్క విలువైనదే వంటి నినాదాలు రాసిన ప్లకార్డులతో గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించి మిషన్ భగీరథ నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ ఇటిక్యాల రాజు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ లక్ష్యాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ అందుతున్న రక్షిత మంచినీటిని వృథా చేయకుండా భావితరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. గతంలో తాము సర్పంచ్ గా ఉన్నప్పుడు కూడా గ్రామానికి నీటి కొరత లేకుండా పరిపాలించామని గుర్తు చేశారు. నీటి సరఫరా విభాగం సహకారంతో భవిష్యత్తులో కూడా నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముస్తాబాద్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం...

**ఐచర్ ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి...**





**ముస్తాబాద్ మండలం/ మార్చి 08 ప్రజా దివాస్** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాల య్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుగల్ గ్రామంలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న లోహ నందకుమార్, తనతో పాటు మరో ముగ్గురు కూలీలతో కలిసి ఐచర్ ట్రాక్టర్లో ఇటుకలను లోడ్ చేసుకుని చిప్పలపల్లి గ్రామంలో అన్లోడ్ చేసేందుకు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా, రాత్రి 9:30 గంటల సమయంలో పోతుగల్ గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్దకు చేరుకోగానే డ్రైవింగ్ చేస్తున్న నందకుమార్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నందకుమార్కు తీవ్ర గాయాలు కాగా, అతనితో ఉన్న మరో కూలీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 వాహనంలో వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు నందకుమార్ అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడు ఇటుక బట్టీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడని, అతని మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతిని తండ్రి ధనర్జలూహ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ చేపనట్టినట్టు ఎస్సై గణేష్ ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు...

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 8 ప్రజా దివాస్**
సిరిసిల్ల పట్టణంలోని సి నా రే కళా మందిరం లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గారు, మహిళా కౌన్సిలర్లు, పురపాలక సంఘం మహిళా ఉద్యోగులు, మరియు మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ మహిళల సాధికారత, సమాన హక్కులు, మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధిలో మహిళలు ముఖ్యమైన శక్తిగా నిలుస్తారని తెలిపారు. మహిళలు విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ముందుకు సాగి ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మేమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. మహిళా ఉద్యోగులు మరియు మహిళా నాయకులు తమ అనుభవాలను పంచుకుంటూ ఇతర మహిళలకు ప్రేరణగా నిలిచారు.మహిళల భద్రత, స్వావలంబన, మరియు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి కూడా ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. మహిళలు సమాజంలో గౌరవంతో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు మరియు మెప్మా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

